



# వాస్తవానికి...

ఆనాడు ఫస్టుతారీఖు. ఆఫీసులో ఉద్యోగస్తులకి జేబులునిండేరోజు. గుమస్తా రామం కూడా తను పడ్డ నెలదినాల పాటుకీ ప్రతిఫలం కొన్నినోట్లరూపంలో అందుకొన్నాడు. అదొరికే ఎనభైరాళ్ల లోనూ, తనూ, భార్యా, నలుగురుపిల్లలూ బ్రతకాలి. తలి దండ్రులకు ఏమైనా మిగిల్చి పంపాలి. ఇంటి అద్దె బోలెడు. ఈ చాలీ చాలని జీతంతో, హెచ్చు ధరల వత్తిడికి, రామం మూడుగంటల కాలక్షేపం కోసం సినిమాకి పోవడం మానుకున్నాడు. తక్కినవిలాసాలమాట ఎత్తుకుందికే భయపడి పోయాడు. ముఖ్యావసరాలు గడుపుకు వస్తుంటేనే, నెలకి ఇరవై, నలభై అప్పుపెరుగుతోంది.

అయితే ఈఅవస్థలు తనవక్కడికేనా, లేక, తనలాగ బ్రతుకుతున్న అందరికీనా అన్న అనుమానంతో రామం ఆనాటి సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికినడుస్తూ ఆలోచించుకుంటున్నాడు. తనతోటి గుమస్తాలు చాలామంది సిటీ బస్సులకోసం "క్యూ" లో నిల్చొని అవస్థలు పడ్డం చూచి రామం నవ్వుకున్నాడు. అందులో కొందరి నివాసాలు మైలులోపే! అయినా ఎందుకో ఆ పడిగాపులు? రామం మెయిన్ రోడ్డంట నడుస్తున్నాడు. సినిమా బుకింగులవద్దవున్న "క్యూ" మరీ ఘోరంగా అవుపించింది. రెస్టారెంట్లు, బట్టల షాపులూ, చివరకు సెలూన్‌లూ (క్షౌరశాలలు) ఆహ్వాన పత్రికలందిస్తున్నట్లు మెర్క్యురీ లైట్లతో కలకల్లాడుతున్నాయి. రామం పరధ్యానంగానే తనవీధి మలుపుతిరిగాడు. అదే సమయానికి వక "ఆస్టిన్" కారు దూసుకువచ్చి రామంముందు "కిఱ్ఱు" మంటూ ఆగింది. రామం తృళ్లిపడి తప్పుకున్నాడు. మరే గండం ఎదురవకుండానే రామం ఇంటికి చేరుకున్నాడు.

భార్య సుశి ప్రక్కలో చంటాడితో నిద్రపోతోంది. ఆమె మెడనుంచిగొలుసు మార్వాడి షాపుకి వెళ్లి సంవత్సరం పూర్తిగానే అయింది. నేటివరకు అకుదనపెట్టిన గొలుసు విడిపించలేక పోతున్నాడు. బోసిమెడ అని సుశి ఎన్నడూ చిన్నపోలేదుకూడా. అయితే తను మాత్రం చిన్నబోతున్నాడు. ఇంటికి వస్తున్నప్పుడు పిల్లాడికి మాత్రం పాల డబ్బా కొనుకొచ్చాడు.

రచన:
పారనంది

రామం దొడ్లోకి వెళ్లాడు. పండు వెన్నెల! గాలికి చెట్లఆకుల గలగలలు! వాటి ఫలితంగా సువాసన నిండినచల్లని గాలి! రామం గచ్చు బెంచీపై కూర్చుని నిర్మలాకాశంవైపు చూస్తున్నాడు తనను తనే మరచి పోయినట్లు.

* * *

రామంపోస్టుమాన్ తెచ్చిన టెలిగ్రాం అందుకొని చదివాడు. పిచ్చిగా అరచాడు. ఆ అరపులకే ఇంట్లోవారూ, ఇరుగూ. పొరుగూ అందరూ పోగయ్యారు. రామం గెంతులేస్తున్నాడు. చేరినవారందరూ "ఏమైందని" ఏకకంఠంతో ఆతృతగా ప్రశ్నించారు. భార్య అప్పటికే భయపడి శోకాలు ప్రారంభించింది. పట్టపగ్గాలు తెగిగెంతులేస్తున్న రామాన్ని వకడు అతి ప్రయత్నంపై ఆపి "ఏమిటిదంతా?" అని రామం వైపు కోపంగా చూచినట్లు చూశాడు. రామం తన చేతిలోని కాగితం అందిచ్చాడు.

అందరూ రామాన్ని అంధలం ఎక్కించారు.

పొగడ్తలతో ఆకాశాని కెత్తారు.

"ఎంత అదృష్టం" అన్నదో గొంతు ఏడుపుముఖం పెట్టి. "దేనికైనా వ్రాసి వుండాలి నుదుట" ఇంకొకరి ఈర్ష్యతో కూడినవాక్కు.

"అంతే! అంతే!!" మరొకరి సమర్థింపుతో కూడిన జీరగొంతుక.

ఇట్లాంటి గందరగోళ వాతావరణాన్నుంచి తెలివైన కొందరు రామాన్ని గదిలోనికి తీసుకపోయి విశ్రాంతి తీసుకోమన్నారు.

"బ్రతికాం" అనుకుంటూ రామం మంచంమీద వాలిపోయాడు.

రామం ఇప్పుడు లక్షాధికారి. బాంక్ ఎక్కవుంట్ వుంది. పోగా వెయ్యికిపైగా తను చేసిన అప్పులు తీర్చడానికి తన వద్ద అట్టే పెట్టుకున్నాడు. తెల్లని గ్లాస్గో

పంచె, లాంగ్‌లాత్ కల్లీలాల్చీ, చలువ కళ్లద్దాలూ—ఈవేషంతో రామం మొట్ట మొదటి సారిగా కిరానా దుకాణదారు వైపు నడిచాడు. శెట్టి అల్లంత దూరాన్నుంచే పరుగెత్తుకు వెళ్లి రామాన్ని ఆహ్వానించాడు.

శెట్టిగారూ! మీబాకీ...అరవైనాలుగు చిల్లరకదండీ"

"బాకీమాటకేం లెద్దురూ! మిమ్మలిని ఎన్నడైనా తొందరచేశానా? మీవద్ద వుంటేనేం, నావద్దనైతేనేం సామాన్లన్నీ ఇంటికి మా నౌకరు చేత పంపించ మన్నారా?"

రామం ఎన్నడూ విననిశెట్టి వాక్యాలకి ఆశ్చర్యపోతూ "అలాగే పంపించండి కాని, ముందు పాత బాకీ జమ కట్టుకోండి" అని అచ్చటనుంచి తన స్నేహితుడు నారాయణ యింటికి బయలుదేరాడు.

"ఇందరా నా ఆపదలో కాపాడిన నీ రెండువందలూనూ తీసుకో"

"అదేమిత్రా! తొందరేమొచ్చింది. పోనీలే, నాకూ అవసరంవుంది. ఎలానూ ఇస్తానన్నావు మరోవంద కలిపి ఇయ్యి"

"ఇంకో వందయినా కలిపి యిస్తా లేరా" అంటూ రామం నారాయణకి డబ్బిచ్చి మార్వాడీ షాపుకి బయలుదేరాడు. మార్వాడీసేట్ రామానికి ఎంతో మర్యాదచేసి డ్రింక్ ఇప్పించాడు.

"ఖ్యా, రామంగారూ, మా దుఖాణంలో తమరూ భాగం కలపాకూడదూ."

రామం నవ్వుతూ "ఆలోచిద్దాం లెండి" అన్నాడు. ఎన్నినాళ్లయో విడిపిద్దామనుకుంటున్న భార్య గొలుసు ఈనాడు విడిపించాడు. సంవత్సరమయి తను కన్న కలలు నిజరూపం ఈక్షణానే దాల్చాయి.

భార్యమెడలో గొలుసు తళుక్కుమంది. పిల్లలందరూ మంచిదుస్తులతో, ఆరోగ్యంగా నవ్వుతూ ఆడుకుంటున్నారు. ఇంటినిండా ఫర్నిచర్ నాగరికతని చాటుతోంది. తనకు ఆనాటి నుండీ మంచి రోజులు వచ్చాయనుకున్నాడు.

రామం వాలుకుర్చీలో కూర్చుని తను ఏర్పాటు చేయబోతున్న డిన్నర్ పార్టీకి ఎవరెవర్ని పిలవాలో, ఏమేమి చెయ్యాంచాలో ఆలోచిస్తున్నాడు. ఇంటికప్పుకేసి దృష్టి సారించి, పెంకు తీయించివేసి, గోడలు బలంచేస్తూ పైనో అంతస్థు కట్టిస్తే బావుంటుందనుకున్నాడు.

"లోపలకి రావచ్చాండి" అని వక కోమల మైనధ్వనితో ఆపదసరళి రామం చెవుల్లోకి ప్రాకింది. ఆసన్నని మాటలతో ఆడ గొంతుక అని ఆనవాలు పట్టి, తన ఆలోచనకి స్వస్తిచెప్పి రామంద్వారం వైపు చూశాడు. నాగరికతకు మారుపేరా అన్నట్లు అచ్చట క్రిస్టియన్ యువతి గాబోలు వయ్యారంగా నిలబడి ఇతడు చూడగానే చేతులు జోడించి "నమస్కారం రామంగారూ!" అంది.

ఆమె చేతుల కదలికలో గాజులు వింత శబ్దాన్నిచ్చాయి. రామం లోనికి రమ్మని ఆహ్వానించాడు. ముఖమల్ చత్సుర్ బయట విడచివచ్చి రామానికెదురుగా కుర్చీలో కూర్చుంది. ఆ కూర్చున్నప్పుడు జార్జట్‌చీర పైట జారి పోతూవుండే ఓమారు నవ్వుతూ సర్దుకుంది. నీలిరంగు సిల్కుజాకట్ వంటినంతటినీ పట్టుకొనివుంది.

"క్షమించాలి. నన్ను ప్రభ అంటారు. మనదేశంలో ముఖ్యంగా మన ఆంధ్ర రాష్ట్రంలో ముందెన్నడో అవతరించి స్థిరంగా నిల్చిపోయిన సంఘకట్టుబాట్లకితట్టుకోలేక ఎన్నో పసి హృదయాలు లౌకికజ్ఞానం అంటే ఏమిటో కూడా తెలీకుండానే అణగారి పోతున్నాయి. పూవు తన సౌరభాన్ని వెదజల్లకుండానే సమాజం యొక్క ఇనుప కాళ్ల క్రింద నలగిపోతోంది."

"విధవ అన్నమాటలతో యువతులకు జరుగుతున్న అన్యాయం మీకు తెలియనిదికాదు. యిటువంటి అక్రమాలని నిరోధించి, అధర్మాలని నిర్మూలించి సంఘ క్షేమంకోసం, ముఖ్యంగా యువతీ యువకుల స్వాతంత్ర్యం కోసం, వారి అభిరుచులకోసం మేమొక కదలిక ఏర్పాటు జేశాం. దాని ప్రతిరూపమే "యువతీయువకపురోగమన సమితి" నేను ఈ సమితికి అధ్యక్షురాలిని.

ఆ! అసలు సంగతి మర్చేపోయేను. ఈ రాత్రికి "మేనక తియేటర్" లో గొప్పడాన్సు ప్రోగ్రాం. తమరు తప్పక దయచెయ్యాలి.

రామం ఆమె వైపే మ్రాన్పడిచూస్తూ ఆమె వాగ్ధోరణికి, నేర్పుతో కూడిన ఆ మాటలతీరుకే ఆశ్చర్యపోతూ కొంతసేపు ఏమీ అనలేక పోయాడు.

"తప్పక వస్తానండి" అనగల్గాడు.

ప్రభనవ్వుతూ "మరి మీ విరాళం మాట..." రామం గాభరాగా "ఎంత?" చిన్నమొత్తాలు వ్రాస్తే ఏం బావుంటుంది అందాల భరిణె. అందునా ప్రభ ప్రతిభాశాలి అయిన అధ్యక్ష్యురాలు ఎదురుగా కూర్చుని అడుగుతూంటే.

ఆసంఖ్య మీలాంటి వారికి చెప్పవలసిన పనిలేదు? అంటూ చిఱునవ్వునవ్వి ఇందాకటి నుంచీ ఇచ్చిన ఉపన్యాస ఫలితంగా ముఖంనిండా పట్టిన చెమట బిందువులను చేతిరుమాలుతో తుడుచుకొని, రిష్టువాచీ చూచుకుంది సోగ కన్నులు తిప్పుతూ. రామం ప్రభ నుంచి దృష్టి మరల్చలేక పోతున్నాడు. చేతులు మాత్రం డ్రాయరులోవున్న "చెక్కు పుస్తకం" తీశాయి.

"వెయ్యి రూపాయిలు చాలా?" చాలదేమోననే, ప్రభ ఏమనుకుంటుందో అన్న అనుమానంతోనే ప్రశ్నించాడు. ప్రభ కన్నులు సంతోషంతో మెరిశాయి.

సంతకంచేసిన చెక్కు రామం ప్రభ చేతికందిచ్చాడు.

"తాంక్సు రామం గారు, తప్పక వస్తారు కదూ!" లేస్తూ నవ్వి అందా మాటలు.

"ఓ, వస్తాను."



"ఏమండీ, ఇంకా నిద్రేమిటండీ ఎనిమిదౌతుంటే?" ఇంట్లో మంచంవదలి దొడ్లో బెంచీ మీద పడుక్కున్నారేమండీ?" అంటూ సుశి రామాన్ని కదిపింది.

రామానికోతెలియని అనుభూతినిండి జారి పోయినట్టయింది. తృళ్లిపడి లేచాడు. ఎదురుగాసుశి! రామం ఆశ్చర్యానికంతులేదు. కేవలం సుశి బోడి మెడ వైపు చూస్తున్నాడు.

"అదేమిటండీ అల్లాచూస్తారూ. ఆఫీసుకి వేళవుతుంటే? త్వరగా తెమలండి"

"ప్రభ వెళ్లి పోయిందికదూ" అని తననుకోకుండానే తన పెదిమలా మాటలనేశాయి.

వెనుతిరిగి పోబోతున్న సుశి ఆగిపోయి నవ్వుతూ "ప్రభ ఎవరండీ, కలెమైనా వచ్చిందా...?" అని చిత్రంగా చూచింది.

రామం సిగ్గు పడిపోయిలేచి పోయినాడు పడుక్కున్న వాడల్లా.

భర్తకి అన్నం వడ్డిస్తూ సుశి మెల్లిగా "ఏమండీ, ఇందాకే శెట్టి వచ్చాడు. ఎంతో కొంతజమకట్టందే ఈనెల సామానులు ఇచ్చేట్టలేదు అతడి ధోరణి. రామం సుశి నోమారు చూచాడు అమాయికంగా.

"పనిమనిషి జీతం, పాలవాడి వాడుక డబ్బూ మీరు ఆఫీసుకు పోయే ముందు నాకు యిచ్చిమరీ వెళ్లండి. వారు నానెత్తిన కూర్చుంటారు."

"అలాగేలే" అన్నాడు రామం భోజనం ముగిస్తూ. రామం ఆఫీసుకని పంచ కట్టుకోడం పూర్తి అయింది. చొక్కా తొడుగుతున్నాడు.

"ఎల్లుండే పాప పుట్టినరోజు సాయంత్రం వచ్చేప్పుడు పాపకోసం ఏంతెస్తారు?" అంటూ సుశి పాపబుగ్గలు ముద్దు పెట్టుకొని భర్త కందిచ్చింది.

రామం పాపని తప్పని సరిగాఎత్తుకుంటూ "మనపాప ఏమికావాలని అడుగుతూంది మరి? అవే తెస్తాను." అని తనూ ముద్దు పెట్టుకొని సుశి కందిచ్చాడు.

ఇంటిమెట్లు దిగుతూంటే పెద్దకుర్రాడు "నాన్నా, నాన్నా గ్రామరు పుస్తకం కొనకపోతే మాష్టరు తంతారు నాన్నా" అని ఏడుపు ముఖం పెట్టెడు.

"ఇంటికి వచ్చేప్పుడు తెస్తాలేరా" రామం ఇంటి మెట్లు బరువుగా దాటాడు.

ఏమిటిదంతా! రాత్రి ఆకలేమిటి తనకి! ఆకలలోని రామం ఎంత దర్జాగా బ్రతికాడు. మరి ఈరామమో!! బ్రతకడమే కష్టంగా జీవిస్తున్నాడు. ఆఫీసుకి పోతూమధ్యలో రామం అనుకున్నాడు.

"వాస్తవానికి నేనెంత దూరం వున్నాను? కాదు. నేనేవాస్తవానికి దగ్గర రామాన్ని, రాత్రి కలలో? రామం నిజానికిచాలా దూరం. నేను ఈ జీవితంలో ఆరామాన్ని కాలేను. తనూ నాస్థానం పుచ్చుకోడు" అని. ★